మిన్నంటుతున్న కూరగాయల ధరలు

- మార్చి అనంతరం ధరలన్నీ అధిక'మే'
- నెలలోనే ఎంతో వ్యత్యాసం
- బెంబేలెత్తుతున్న సామాన్య జనం
- త్రిపుల్ సెంచరీ కొట్టిన చికెన్..



సత్తెనపల్లి: వేసవిలో పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎండల తీవ్రత వల్ల వర్షాలు లేక బోర్లలో నీరు ఇంకిపోయి రైతుల కూడా పంటలు పండించలేని పరిస్థితి నెలకొంది. కొంతమంది కష్టంగా కూరగాయలను పండిస్తున్నా ప్రజల అవసరాలను ఇవి తీర్చడం లేదు. మార్కెట్‌కు కూరగాయలు ఉత్పత్తులు తక్కువగా రావడంతో వాటి ధరలు పెరిగి సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. కొంతమంది వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి కూరగాయలను దిగుమతి చేస్తూ ఎక్కువ ధరలకు వాటిని విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

కూరగాయలతో ఆరోగ్యం

నిత్యం కూరగాయలు, ఆకు కూరలు తింటే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని వైద్యులు చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ రోజుకు 300 గ్రాముల కూరగాయలు, ఆకు కూరలు తినాలని జాతీయ పోష్టికాహార సంస్థ సూచిస్తోంది. సాధారణంగా ఒక వ్యక్తి కనీసం 100 నుంచి 200 గ్రాముల వరకు కూరగాయలు తీసుకోవాలి. పెరిగిన ధరల కారణంగా ప్రస్తుతం 100 గ్రాములైన తినే పరిస్థితి లేదు. ప్రజల అవసరాల మేరకు కూరగాయల సాగు లేకపోవడం, ఎక్కువ మొత్తం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు అమాంతం పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

ఘాటెక్కిన మిర్చి, అల్లం

అన్ని కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. గతంలో కిలో రూ.20లు ఉన్న కూరగాయలు ప్రస్తుతం రూ.60 నుంచి 100 వరకు పలుకుతున్నాయి. ఇక ఆకు కూరలైతే గతంలో రూ.10 రూపాయలకు రెండు కట్టలు ఇచ్చేవారు... ప్రస్తుతం కట్ట రూ.10 నుంచి రూ.15ల వరకు విక్రయిస్తున్నారు. మిర్చి ధర రికార్డు సృష్టించింది. సెంచరీ దాటి రూ.120 నుంచి రూ.130కు విక్రస్తున్నారు. అల్లం కిలో రూ.150 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నారు.

గుడ్డు.. చికెన్‌ది అదే దారి..

కూరగాయలతో పాటు కోడి గుడ్డు, చికెన్ ధరలు ఆకాశాన్నంటాయి. గతం కంటే ఈ సారి రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. గుడ్డు ధర రూ.4 నుంచి రూ.4.50కు విక్రయించేవారు. ప్రస్తుతం హోల్ సేల్ 100 కోడిగుడ్లు ధర రూ.600 పలుకుతుండగా.. రిటైల్ మార్కెట్‌లో గుడ్డు రూ.6.50 నుంచి రూ.7 వరకు విక్రయిస్తున్నారు. చికెన్ కిలో రూ.260 నుంచి రూ.300 వరకు విక్రయిస్తున్నారు.




పట్టణంలోని రాజీవ్ గాంధీ కూరగాయల మార్కెట్‌లో కూరగాయలు, సెంచరీకి చేరుకున్న పచ్చిమిర్చి

నలుగురున్న కుటుంబానికి వారానికి సరిపడా కూరగాయలు కొనాలంటే అయిదారు వందల రూపాయలు ఖర్చు చేయాల్సిందే. దీనికి తోడు పప్పు దినుసులు, వంట నూనెలు, మసాలా దినుసులు ధరలు గతేడాది కంటే ప్రస్తుతం రెట్టింపు అయ్యాయి. ఆదాయం చూస్తే పెరగడం లేదని, ఖర్చు మాత్రం భారమైందని సామాన్య మధ్య తరగతి ప్రజలు వాపోతున్నారు.

సత్తెనపల్లి మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా..

కూరగాయలు	మార్చి ధరలు (కిలో రూ.)	మే ధరలు (కిలో రూ.)
టమాట	25	50
గోరు చిక్కుళ్ల	40	60
వంకాయలు	40	60
పచ్చిమిర్చి	60	100
బెండకాయలు	40	60
బుంగాళ దుంపలు	30	40
బీర కాయలు	40	60
క్యాబేజీ	30	40
క్యాప్సికం	80	100
క్యారెట్	50	60
కాకర కాయలు	40	60
బీట్‌రూట్	40	60
దొండకాయలు	30	40
సొరకాయ	15	25
ముల్లంగి	20	25
దోసకాయలు	30	50
బీన్స్	100	200
పొట్లకాయలు	30	60
మునక్కాయ	7	10

కాయగూరలు కొనడం కష్టమే



గత కొద్ది రోజులుగా కాయగూరల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. గతంలో రూ.150 తీసుకెళ్తే నలుగురు మనుషులకు వారం రోజులకు సరిపడా కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం మూడు రకాలు కూడా రావడం లేదు. ఓ వైపు నిత్యవసరాలు ధరలు పెరిగి ఇబ్బందిగా ఉంటే.. ఇప్పుడు కాయ గూరలు ధరలు పెరగడం మరింత బాధగా ఉంది.

–భవనం శివమ్మ, గృహిణి, సత్తెనపల్లి

ఇంతగా ఎప్పుడూ ధరలు పెరగలేదు



ఇటీవల కాలంలో ఇంతలా కూరగాయలు ధరలు పెరగడం ఎప్పుడూ చూడలేదు. మార్కెట్‌కు రావాలంటేనే భయం వేస్తోంది. పచ్చిమిర్చి నుంచి కరివేపాకు వరకు అన్ని కూరగాయల ధరలు పెరిగాయి. ఇలా పెరగడం వల్ల సామాన్యుల నెలవారి బడ్జెట్ పరిమితికి మించిపోతుంది. సాధారణంగా కిలో కూరగాయలతో కూరకు బదులు.. ప్రస్తుతం పావు కిలోతో సరిపెట్టుకుంటున్నాం.

–జి.రోజారాణి, గృహిణి, సత్తెనపల్లి

క్లుప్తంగా

ముమ్మరంగా ఉపాధి పనులు



క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఏపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. పంట కాల్వలు, నీటి కుంటలు బాగు చేసే పనులు జరుగుతున్నాయని చెప్పారు. మొత్తం 6 వేలు జాబ్ కార్డుదారులుండగా 4,560 మంది పనులకు హాజరువుతున్నారని వెల్లడించారు. సోమవారం క్రోసూరులో జరుగుతున్న కరువు పనులను ఆయన సందర్శించారు. ఎంత మంది వచ్చినా ఉపాధి హామీ పనులు చూపించగలమని,ప్రతి ఒక్కకార్డు దారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కేవీ రమణ సమావేశం నిర్వహించి ఉపాధిహామీ పనులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పనులపై సచివాలయ సిబ్బంది, పీఏస్‌లు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలుంటే వాటిని అధిగమించేందుకు ఏపీవోతో చర్చించాలని కోరారు.

ఘనంగా లూథరన్ చర్చి వార్షికోత్సవం



క్రోసూరు: స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చి 8వ వార్షికోత్సవాలు మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. సోమవారం ముగింపు సందర్భంగా ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చి పాస్టర్ రెవ.డాక్టర్ ఎం.సుందరరావు ఏసు ప్రభువు చెప్పిన బోధనలు విశ్వాసులకు తెలియపరిచారు. క్రోసూరు చర్చి ద్వారా చుట్టు పక్కల గ్రామాలకు పరిచర్య అందించబడుతుందని వివరించారు. విశ్వాసులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక సంఘ పెద్దలు పర్యవేక్షించారు. పలు సంఘాల సేవకులు, డెలిగేట్ మనోహర్, సంఘ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పెదకూరపాడులో పోలీసు కవాతు



పెదకూరపాడు(అమరావతి) : పెదకూరపాడులో సత్తెనపల్లి డీఎస్పీ నరసింహారావు ఆధ్వర్యంలో పోలీసు కవాతు సోమవారం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో డీఎస్పీ నరసింహారావు మాట్లాడుతూ మండల పరిధిలోని గ్రామాలలో ప్రశాంతత నెలకోల్పడానికి ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో పోలీస్ పికెటింగ్‌లు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో అల్లర్లకు, హింసాత్మక ఘటనలకు పాల్పడిన వారిపై ఇప్పటికే బైండోవర్ కేసులు పెట్టామని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కవాతులో క్రోసూరు, అమరావతి సీఐలు మంగారావు, ఏవీ బ్రహ్మం, ఎస్సైలు విప్పర్ల వెంకట్రావు, పవన్‌కుమార్‌తో పాటుగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ పాల్గొంది.

మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



అమరావతి: పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాలతో మండల పరిధిలోగల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేయుచున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఎంపీడీఓ ఆఫీసు మీటింగ్ హాల్‌లో సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారికి వంటల పోటీలు నిర్వహించి, బహుమతులు ప్రదానం చేశారు. మండల విద్యాశాఖాధికారులు ఏకుల ప్రసాదరావు, శివబాబు అధ్యక్షతన నిర్వహించిన శిక్షణలో విద్యార్థికి దిన సరి ఆహారంలో ఖచ్చితంగా అందించాల్సిన పోషకాలు, వాటి ఆవశ్యకత, అవి మోతాదులో అందకపోతే ఎదురయ్యే అనారోగ్య సమస్యల గురించి వివరించారు. వంట చేసేటప్పుడు పోషకాలు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గోరు ముద్ద పథకంద్వారా ప్రభుత్వం అందిస్తున్న మెనూ అమలును ప్రజెంటేషన్‌ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో శిక్షణ పొందిన రిసోర్స్ పర్సన్ నర్రా వెంకాయమ్మ గోరుముద్ద పథకానికి సంబంధించిన కొన్ని ముఖ్య సూచనలు, సలహాలు అందించారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శ్రీ రామకృష్ణ హిందూ హైస్కూల్ నందు వంట పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈఓ శివబాబు బహుమతులు ప్రదానం చేశారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 95 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

అభ్యర్థి విజయం..ఆమె నిర్ణయం

- 2019 కంటే తగ్గిన 0.67 శాతం పోలింగ్
- గెలుపోటములను నిర్దేశించేది మహిళలే
- ఫలితాలపై నియోజకవర్గంలో విస్తృత చర్చ

సత్తెనపల్లి: నియోజకవర్గంలో 2019 అసెంబ్లీ ఎన్నికల కంటే ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ పోలింగ్ శాతం తగ్గింది. ఈ పోలింగ్‌లో పురుషుల కంటే మహిళలు 4,265 మంది అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఐదేళ్ల కాలంలో మహిళల స్వయం సమృద్ధికి, ఆర్థిక స్వాలంబనకు సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక పరమైన చేయూత, సామాజిక వర్గాల వారీగా ఇంటి పట్టునే ఉన్న మహిళలకు ఉపాధి కలిగించడానికి కాపు నేస్తం, ఈబీసీ, నేస్తం వంటి పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసింది. డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీతో పాటు వడ్డీ రాయితీ ఇవ్వడంతో పాటు పాత బకాయిలు విడతల వారీగా ప్రభుత్వమే తీర్చింది. దీంతో మహిళలు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయడం, అల్పాదాయ వర్గాలు, పేద వర్గాలు నిలదొక్కుకునేందుకు వీలుగా బిడ్డల విద్యకు అమ్మఒడి, పండుటాకులకు గడప వద్దకే తీసుకెళ్లి ఠంచనగా పింఛన్ అందించడం వంటివి మునుపెన్నడూ జరగని విధంగా అమలయ్యాయి. ఈ అభిమానం చాటుకొనే అవకాశం ఓటు ద్వారా రావడంతో కృతజ్ఞతను తెలియజేయడానికి మహిళలు ఉదయాన్నే క్యూ లైన్లలో బారులు తీరడం వల్ల పోలింగ్ వైఎస్సార్ సీపీకీ కలిసొచ్చే వాతావరణంగా ఉంది. ఇదే విషయంపై ప్రస్తుతం నియోజకవర్గంలో విస్తృత చర్చ సాగుతోంది. 2014, 2019 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌తో పోల్చుకుంటూ గెలుపుపై అంచనాలతో చర్చ సాగిస్తున్నారు.

తగ్గిన పోలింగ్ శాతం..

తాజాగా ముగిసిన పోలింగ్ నియోజకవర్గంలో 86.97 శాతం మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2019లో 87.64 శాతం పోలింగ్ నమోదైంది. గతం కంటే 0.67 శాతం పోలింగ్ తగ్గింది. ప్రస్తుతం నియోజకవర్గంలో 2,42,047 మంది ఓటర్లకు గాను 2,10,500 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1,03,116 మంది ఓట్లు వేయగా, మహిళలు 1,07,381 మంది ఓట్లు వేశారు. పురుషులకంటే 4,265 మంది మహిళలు అధికంగా ఓటు వేశారు. నియోజకవర్గంలో అత్యధికంగా సత్తెనపల్లి రూరల్ మండలంలో 91.34 శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ మొత్తం 61,692 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 30,073 మంది, మహిళలు 31,619 మంది ఉన్నారు. కాగా మొత్తం 56,351 మంది ఓటర్లు ఓటు హక్కును వినియో గించు కున్నారు. వీరిలో పురుషులు 27,531 మంది, మహిళలు 28,820 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అత్యల్పంగా సత్తెనపల్లి పట్టణంలో 81.84 శాతం పోలింగ్ నమోదైంది. పట్టణంలో మొత్తం 47,915 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు 23,112 మంది, మహిళలు 24,798 మంది, థర్డ్ జెండర్ ఐదుగురు ఉన్నారు. మొత్తం 39,215 మంది ఓటు హక్కు వినియోగించుకోగా వీరిలో 18,914 మంది పురుషులు, 20,299 మంది మహిళలు, ఇద్దరు థర్డ్ జెండర్ ఉన్నారు. 2019 ఎన్నికల పోలింగ్‌ను బేరీజు వేసుకొని విశ్లేషణలతో కాలక్షేపం చేస్తున్నారు.



పట్టణంలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు(ఫైల్)

లయన్స్ క్లబ్ టౌన్ అధ్యక్షుడిగా కిషోర్‌కుమార్

సత్తెనపల్లి: లయన్స్ క్లబ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడిగా పొన్నెకంటి కిషోర్ కుమార్‌ను ఎన్నుకున్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన లయన్స్ క్లబ్ కార్యవర్గ సమావేశంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్–2024–25 లయన్ స్టిక్ సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా బండ్లమూడి వీరాంజనేయులు, కోశాధికారిగా బత్తుల రోశయ్య, ఉపాధ్యక్షులుగా లయన్స్ పెద్దింటి వేంకటేశ్వర్లు, తిరుమల సాంబశివరావు, కొప్పురావూరి రాజశేఖర్, జాయింట్ సెక్రటరీగా తోట పద్మ, టైల్ ట్విస్టర్‌గా బండి విజయలక్ష్మి, లయన్ టేమర్‌గా వీవీ రామకృష్ణమాచార్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత అధ్యక్షుడు మంచికంటి వేంకటేశ్వరరావు, సీనియర్ లయన్స్ క్లబ్ మెంబర్స్ కంబాల వేంకటేశ్వరరావు, వై.పి.మురళీకృష్ణ, పెద్దింటి చంద్రయ్య, కోట వేంకటేశ్వర్లు, కంకణాల విష్ణువర్ధనరావు, కొండవీటి రాజు, తోట చినసాంబశివరావు, కొప్పురావూరి గురుప్రసాద్, గ్రంధిశిల శ్రీనివాసరావు, పెరుమాళ్ళ శ్రీనివాసరావు, పొత్తూరి రామకోటయ్య, తవిటి భావనారాయణ పాల్గొన్నారు. నూతన కార్యవర్గం జూలై 1వ తేదీ నుంచి కార్యాచరణలో కొనసాగనుంది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని పలువురు ప్రత్యేకంగా అభినందించారు.



పొన్నెకంటి, బండ్లమూడి, బత్తుల

మాజీ ప్రధాని నెహ్రూకు ఘన నివాళి

సత్తెనపల్లి: భారతదేశ మొట్టమొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కాలంలో పంచవర్ష ప్రణాళిక అమలు చేయడం ద్వారా దేశం ఎంతో పురోగతి సాధించిందిదని కాంగ్రెస్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుక్కా చంద్రపాల్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 60వ వర్ధంతి కార్యక్రమం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి జ్ఞానరాజు పాల్ అధ్యక్షత సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రపాల్ మాట్లాడుతూ పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 1940వ సంవత్సరం ముందు స్వాతంత్ర ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం గడిపారన్నారు. ముందుగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి మాదంశెట్టి వేదాద్రి, కాంగ్రెస్ నాయకులు షేక్ అజీమ్, కోట ఆనంద్, షేక్ ఆరిఫ్, కోటంపాటి సాంబశివరావు,షేక్ సుభాని, పాల్గొన్నారు.



నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చంద్రపాల్, నాయకులు

ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ల ప్రదానం

సత్తెనపల్లి: కళా, సాహితీ రంగాల్లో పట్టణానికి చెందిన కళాకారుడు బెజగం రవికుమార్, సాహితీవేత్త డాక్టర్ సరికొండ రమాదేవి ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు అందుకున్నారు. ఒంగోలు పట్టణంలో లిటిల్ చాంప్స్ అకాడమీ, కేఆర్ ఫౌండేషన్ సంయుక్తంగా మల్లయ్య లింగయ్య భవన్‌లో ఈ నెల 26న వివిధ రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి, ఇంటర్నేషనల్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లను ప్రదానం చేసి, సత్కరించారు. వారిలో ఇద్దరు సత్తెనపల్లి వాసులు ఉండటం గమనార్హం. వారిద్దరినీ స్థానిక ప్రజలు ప్రత్యేకంగా సోమవారం అభినందించారు.



సత్కారం అందుకుంటున్న రవికుమార్



డాక్టర్ రమాదేవి

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నాం

మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయ పరిధిలో అన్ని వార్డులకు మంచినీటి సరఫరా చేసేందుకు కార్యాచరణ చేపట్టామని మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్మన్ వెంకట సుబ్బారావు మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు చర్యలు తీసుకోవటం జరిగిందన్నారు.



కృష్ణా జలాలు పైపులైన్ ద్వారా ప్రజలకు అందిస్తున్నామన్నారు. పైపులైన్‌లు పూర్తికాని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామన్నారు. అలాగే పట్టణంలోని వార్డులలో సమస్యలను ఆయా వార్డు కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటన్నిటిని పరిష్కరించే విధంగా అడుగులు వేస్తున్నామని చైర్మన్ తెలిపారు. అలాగే చిన్న చిన్న అభివృద్ధి పనుల్లో మున్సిపల్ అధికారులు త్వరలోనే చర్యలు చేపటడం జరుగుతుందని తెలిపారు. వైస్ చైర్మన్‌లు షేక్ జైలాబ్దీన్, కొమ్ము ముక్కంటి పాల్గొన్నారు.

ముప్పాళ్లలో కార్డన్ సెర్చ్

ముప్పాళ్ళ: మండల కేంద్రమైన ముప్పాళ్లలో సత్తెనపల్లి సర్కిల్ సీఐ ఎం.రాంబాబు ఆధ్వర్యాన సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని ముస్లిం కాలనీ, బీసీ ఏరియాలోని గృహాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పాడుబడ్డ గృహాలతో పాటుగా, ఖాళీ స్థలాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వాహనాలను స్వాధీనం చేసుకొని, ధృవపత్రాలు తీసుకురావాలని వాహనదారులకు సూచించారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఎవరూ వివాదాలకు పోవద్దని, ఎవరైనా గొడవలను ప్రోత్సహిస్తే వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం.రాంబాబు హెచ్చరించారు. గొడవలు వలన కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని, యువత జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలన్నారు. ఎస్సై పి.హజరతయ్య, ఏఎస్సైలు ఇమామ్, నవరాజు, కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ముప్పాళ్ళలో తనిఖీ చేస్తున్న ఎస్సై హజరతయ్య, సిబ్బంది

క్రిస్టియన్ పేటలో...

సత్తెనపల్లి: పట్టణ సీఐ పోలూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పట్టణంలోని క్రిస్టియన్‌పేటలో పోలీసులు సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గృహాల్లో విస్తృతంగా తనిఖీలు చేశారు. పాత నేరస్తులు, అనుమానితులు, స్థానికేతర్ల కదలికలపై ఆరా తీశారు. తనిఖీల సందర్భంగా సరైన పత్రాలు లేని ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పర్చుకొని పట్టణ పోలీస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన చివరి ఘట్టం జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు ఆస్కారం ఉంటుందనే సూచనలు నేపథ్యంలో కార్డన్ సెర్చ్ చేపట్టినట్లు తెలిపారు. ఆయన తో పాటు సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్‌కుమార్, పట్టణ ఎస్ఐలు ఎం. సంధ్యారాణి, ఎం. సత్యనారాయణ, పోలీసులు, మహిళా పోలీసులు తనిఖీల్లో పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీకి 248 మంది గైర్హాజర్

సత్తెనపల్లి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు సత్తెనపల్లి విద్యా డివిజన్ పరిధిలోని 14 మండలాల్లో సోమవారం 248 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంగ్లీష్ పరీక్షకు 446 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 198 మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీకి 129 మంది..

సత్తెనపల్లి: ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షలకు సోమవారం 129 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రగతి జూనియర్ కళాశాల, కృష్ణవేణి జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం మ్యాథ్స్, బోటనీ, సివిక్స్–1కు 663 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 580 మంది హాజరయ్యారు. 83 మంది గైర్హాజరయ్యారు. అలాగే మ్యాథ్స్, బోటనీ, సివిక్స్–2 కు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 306 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 261 మంది హాజరయ్యారు. 45 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరింటెంట్ శైలజాకుమారి తెలిపారు.

పిల్లలందరినీ బడిలో చేర్పించాలి



నందిగామ ఎస్సీ కాలనీలో చిన్నప్ప అవగాహన

సత్తెనపల్లి: బడికి వెళ్లడం పిల్లల హక్కు అని, వారిని చదివించడం తల్లిదండ్రుల బాధ్యత అని బడి బయట ఉన్న పిల్లల అందరిని బడిలో చేర్పించాలని డీబీఆర్సీ గుంటూరు, పల్నాడు జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప పిలుపునిచ్చారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం నందిగామ ఎస్సీ కాలనీలో అంగన్వాడీ కార్యకర్త సుజాత, వాణి సోమవారం విద్యా చైతన్య ప్రచారోద్యమ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నప్ప మాట్లాడుతూ సమాజంలో గౌరవం రావాలంటే ప్రతి ఒక్కరూ బడికి వెళ్లి చదువుకొవాలన్నారు. చదువు వల్ల పరిశుభ్రత, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని, ప్రభుత్వం ఇస్తున్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుక పథకాల లబ్ధిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా దార్ల మేరీ తదితరులు ఉన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



క్రోసూరు: ప్రభుత్వం నిర్ణయించిన ధరకల కంటే అధికంగా విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల ఏవో వేణుగోపాల్ సోమవారం హెచ్చరించారు. స్థానిక విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను పరిశీలించారు. కలుపు మందు తట్టుకునే బీటీ విత్తనాలకు అనుమతులు లేవన్నారు. అటువంటి విత్తనాలు ఎవరైనా విక్రయిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. విత్తన డీలర్లు ప్రతి రోజు స్టాక్ బోర్డు ప్రకటించాలన్నారు. రైతులు కూడా బిల్లులు లేకుండా ఎటువంటి విత్తనాలు కొనుగోలు చేయవద్దని సూచించారు.

గంగమ్మతల్లి ఆలయ భూముల కౌలు వేలం

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లు గంగాదేవి పేరంటాలమ్మ ఆలయ భూములు కౌలు వేలం సోమవారం నిర్వహించారు. ఆరు బిట్లుగా 9.50 ఎకరాల భూమి మూడేళ్ల కౌలుకు బహిరంగ వేలం నిర్వహించినట్లు సత్తెనపల్లి ఆలయ పర్యవేక్షణాధికారి వి.లీలావతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుమారు 50 మందికిపైగా పాల్గొన్నట్లు చెప్పారు. రూ.5వేలు ధరావత్తు చెల్లించిన వారినికి బహిరంగ వేలం పాటలో పాల్గొనేందుకు అవకాశం కల్పించామన్నారు. గ్రామానికి చెందిన రాచమంటి నాగయ్య, నంబూరి మస్తాన్‌రావు, నంబూరు వీరాంజనేయులు, పూల బాలస్వామి, వూరె వెంకట్రావు, చావా వెంకటేశ్వర్లు తదితరులు రూ.1,36,000లకు జూన్ 1వ తేదీ నుంచి, మే 30, 2027వరకు భూములపై హక్కులు పొందినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి గాదె కొటిరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.